

# మందారమాల
## సత్యం మందపాటి

నెలనెలా ఓ ప్రతిభామూర్తికి అభినందన మందారమాల 28

# జానపద రసరాజు



తేటతెల్లమైన చక్కటి పల్లె పదాల పొందిక.

సందర్భానుసారంగా కడుపుబ్బ నవ్వించే హాస్యం.

పాత్రోచితంగా అమరిపోయే సున్నితమైన చమత్కారం.

మధ్యే మధ్యే రాజకీయ నాయకుల మీద చెణుకుల బాణాలు.

నిరుపేదల శ్రమ జీవనం మీద మంచి అవగాహనతో చూపించే సామ్యవాదం.

ఇవన్నీ వెరసి చూస్తే ఒకే ఒక జన పద కవిరాజు. జానపద రసరాజు.

ఆనాటి తెలుగు చిత్రరంగంలో సరదా పాటల మహారాజు.

కొసరాజు.

0 0

0

'కల్లా కపటం కానని వాడా, లోకం పోకడ తెలియనివాడా

ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా, నీ కష్టమంతా తీరునురో రన్నో చిన్నన్నా... '

ఈ పాట యాభై ఏళ్ళకి పైగానే వ్రాసినా, ఈనాటికీ మరువలేనిది. మనల్ని మధుర స్మృతుల్లోకి తీసుకువెళ్ళే సుమధురమైన సాహిత్యం, సంగీతం, గానం.

'నవధాన్యాలను గంపకెత్తుకుని, చద్దియన్నము మూట గట్టుకుని

ముల్లుగర్రను చేత బట్టుకుని, ఇల్లాలుని నీ వెంటబెట్టుకుని... '

'పడమట దిక్కున వరద గుడేసె, ఉరుముల మెరుపుల వానలు కురిసే

వాగులు వంకలు ఉరవడి జేసే, ఎండిన బీళ్ళూ ఇగుళ్ళు వేసే... '

'కోటేరుని సరిజూచి పన్నుకో, యెలపట దాపట ఎడ్ల దోలుకో

చాలు దప్పకా కొండ్రa వేసుకో, విత్తనమ్ము ఇసిరిసిరి చల్లుకో... '

తేటతెల్లమైన చక్కటి పల్లె పదాల పొందిక అంటే ఇదే! ఈ పాటలో ఆనాడే చెప్పిన ఈనాటికీ నిజమైన ఒక సూక్తి కూడా వుంది.

'పల్లెటూళ్ళలో చెల్లనివాళ్ళూ, పాలిటిక్స్‌తో బ్రతికేవాళ్ళూ
ప్రజాసేవయని అరిచేవాళ్ళూ, ఒళ్ళు వంచి చాకిరికి మళ్ళరూ'

0 0 0

పైన చెప్పినది జానపదమయితే, ఈ క్రింది పాట ఒక సరదా పాట.

'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే, అయ్యయ్యో జేబులు ఖాళీ ఆయెనే
ఉన్నది కాస్తా వూడింది, సర్వ మంగళం పాడింది
పెళ్ళాం మెడలో నగలతో సహా తిరుక్షవరమై పోయింది!'
'తెలివితక్కువగ చీట్ల పేకలో దెబ్బతింటివోయి, బాబూ నిబ్బరించవోయి!
నిలువుదోపిడి దేవుడికిచ్చిన ఫలితం దక్కేది,
ఎంతో పుణ్యం వచ్చేది, చక్కెర పొంగలి చిక్కేది!'
'ఛాన్సు తగిలితే ఈ దెబ్బతో మన కరువు తీరవచ్చు!
పోతే... అనుభవమ్ము వచ్చు! చివరకు జోలె కట్టవచ్చు!'

0 0 0

సౌమ్యవాదమే కాక, సామ్యవాదంలోనూ దిట్ట కొసరాజు.

'మేడల మిద్దెల మెలిగే వారిలో పూరి గుడిసెలో తిరిగే వారిలో
రక్తమాంసములు ఒకటే కదరా హెచ్చుతక్కువలు హుళక్కి కదరా!
కళ్ళు తెరచి కనరా! సత్యం వొళ్ళు మరచి వినరా! సర్వం నీకే బోధపడురా!'

0 0 0

కొసరాజు రాఘవయ్య చౌదరి 1905లో గుంటూరుజిల్లాలోని అప్పికట్ల గ్రామంలో ఒక రైతు కుటుంబంలో పుట్టారు. పల్లెటూరి వాతావరణంలో పెరిగి ఆ సంస్కృతిని ఆకట్టుకున్న రాఘవయ్య చిన్నప్పటినించీ సాహిత్యం మీద ఉత్సాహం చూపించేవారు. తెలుగు పండితుడు, రచయిత కొండముది నరసింహం పంతులుగారి ప్రభావం రాఘవయ్య సాహిత్య కళాపోషణకి బాగా దోహదపడింది.

ఆయన వ్రాసిన రామాయణం నాటకంలో ఒక వేషం కూడా వేసేవారు రాఘవయ్య. తర్వాత 'రైతు పత్రిక'కు విలేఖరిగా పనిచేశారు. కడగళ్ళు అనే తన కవితా సంపుటినీ ప్రచురించారు. అప్పుడే సినీ గీత రచయిత సముద్రాల రాఘవాచార్యతోనూ, దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మంతోనూ పరిచయమయింది. 1939లో రైతుబిడ్డ అనే సినిమాలో కథానాయకుడిగా నటించారు. తర్వాత సినిమా పాటల రచయితగా స్థిరపడి, కొసరాజుగా 350 చిత్రాలకు పైగా తన బాణీలో విలక్షణమైన ఎన్నో గొప్ప పాటలు వ్రాసి, 1984లో రఘుపతి వెంకయ్య పురస్కారం సంపాదించుకున్నారు. ఆయనకు జానపద కవిసార్వభౌమ అనే బిరుదు కూడా వుంది. 1987లో మన మనసుల్లో మధుర సినీ గీతాల రసరాజుగా మిగిలిపోయి, తనువు చాలించారు కొసరాజు.

0 0 0

కొసరాజులాటి హాస్య గీతాల రారాజు, తెలుగువాడవటం మన భలే ఛాన్స్. ఎందుకంటే ఈ పాటలో పదాలు చూడండి.

'గంజి పోసినా అమృతంలాగా కమ్మగ వుందనుకుంటే, బహు కమ్మగ వుందనుకుంటే
ఛీఛా అన్నా చిరాకు పడకా దులపరించుకుని పోయేవాడికి... భలే ఛాన్సులే...
జుట్టు పట్టుకుని బయటకీడ్చినా చూరు పట్టుకుని వేలాడి
దూషణ భూషణ తిరస్కారములు ఆశీస్సులుగా తలిచేవాడికి... భలే ఛాన్సులే... '

ఇలా ఒకటి కాదు, ఎన్నో హాస్య గీతాలు.

'సరదా సరదా సిగరెట్టు... ' అద్దానికి రెండు పక్కలా చూపించే చక్కటి హాస్య గీతం.

'చీటికిమాటికి చీటీ కట్టి వేధించేవానాడు, లాటరిలోనా లక్షలు లక్షలు సాధించేవీనాడు'

'ఏమిటి ఈ అవతారం, ఎందుకు ఈ సింగారం
పౌడరు తెచ్చెను నీకందం, బాగా వేసెయ్ వేలెడు మందం'

'నాణ్యమైన సరుకుంది లాహిరీ'

'రావే రావే బాలా, హలో మైడియర్ లీలా, ఇటు రావే ఇటు రావే, ఐ లవ్‌యూ
పోవోయ్ పోవోయ్ బావా, ఎందుకీ పెడత్రోవ
ఈ పల్లెల్లో మన పల్లెల్లో సాగవీ వేషాలు, చాలులే సరసాలు ఇక చాల్లే'

'చెక్కిలి మీద చేయి వేసి చిన్నదానా'

'మై డియర్ మీనా, మామంచిదానా'

'కొండమ్మో, బంగారపు కొండమ్మో... '

'ఓ రామ నీ నామమెంతో రుచిరా.. '

ఇలాటి ఎన్నో వందల పాటల్లో ఇవి కొన్ని మాత్రమే.

పల్లెటూళ్ళనించీ పట్నాలకి ఎగబడే వాళ్ళకి కూడా హాస్యంతో రంగరించిన ఒక సందేశం వుంది ఈ క్రింది పాటలో. ఇది నాకెంతో ఇష్టమైన పాట.

'తింటానికి కూడు చాలదే జాంగిరీ, వుంటానికి ఇల్లు చాలదే
బస్తీకి పోదాము పైసా తెద్దామె రావే నా రంగసాని
టౌను పక్కకెళ్ళొద్దురా డింగిరీ డాంబికాలు పోవద్దురా
టౌను పక్క కెడితేనూ డౌనయిపోతావురో అబ్బీ నా బంగారుసామీ
కూలి దొరకదు నాలి దొరకదు, గొంతు తడుపుకొన నీరు దొరకదు
రేయిం పగలు రిక్షా లాగిన, అద్దెకు పోను అణా మిగలదు
గడప గడపకూ కడుపు పట్టుకుని, ఆకలాకలని అంగలార్చితే
గేటు బిగించి కుక్కలనే ఉసిగొల్పిస్తారు...
ఫాక్టరీలలో పని సులువంటా గంటయిపోతే ఇంట్లో వుంటా
వారం వారం బట్వాడంటా ఒరే గిరే అన వీల్లేదంటా
కాఫీతోనే గడపొచ్చంటా, కబుర్లు చెప్పుకు బ్రతకొచ్చంటా
చిత్తయిపోయే పిచ్చి ఖర్చులు, పోకిరి మూకల సావాసాలు

చీట్లోపేకలో సిగసిగ పట్లు, తాగుడు వాగుడు తన్నులాటలు
ఇంటి చుట్టునా ఈగలు దోమలు, ఇరుకు సందులో మురుగు వాసనలు
అంటురోగములు తగిలి చచ్చినా, అవతలికిడ్చే దిక్కే వుండదు
వేలికేస్తెనూ కాలికేస్తవూ, ఎనక్కి రమ్మని గోల చేస్తవూ
ఏదారంటే గోదారంటవు, ఇరుకున బెట్టీ కొరుక్కు తింటవు
దిక్కు తోచనీవె పిల్లా తికమక చేసేవే
బస్తీకి నేపోను నీతో వుంటానే రంగీ నా రంగసాని'

0 0 0

కొసరాజు పాటల వైవిధ్యం గురించి చెప్పాలంటే ముఖ్యంగా చెప్పవలసిని రెండు పాటలు.

ఒకటి ఆనాడు కుర్రకారుని ఒక వూపు వూపిన పాట. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో, మహాదేవన్ సంగీత సారధ్యంలో ఘంటసాల, జమునారాణి మత్తెక్కించిన పాట.

'పట్టుకుంటె కందిపోవు పండువంటి చిన్నదుంటె, చుట్టుచుట్టు తిరుగుతారు మరియాదా, తాళి కట్టకుండ ముట్టుకుంటె తప్పు కాదా... మామా... మామా.. మామా... '

రెండవది పూర్తిగా విరుద్ధమైన పాట. కెవిరెడ్డి దర్శకత్వంలోని పెద్దమనుషులు చిత్రంలోని 'నందామయా గురుడ నందామయా'.

ఏనాడో వ్రాసిన ఈ పాట ఈనాడు రాజకీయ నాయకులకి సరిగ్గా సరిపోయే పాట.

'స్వారాజ్య యుద్ధాన జయభేరి మ్రోగించి శాంతమూర్తులు అంతరించారయా
స్వాతంత్ర్య గౌరవము సంతలో తెగనమ్ము స్వార్థమూర్తులు అవతరించారయా!
అ ఆ లు రానట్టి అన్నయ్యలందరికి అధికార యోగమ్ము పడుతుందయా!
గొర్రెల్ను తినువాడు గోవింద కొడ్తాడు, బర్రెల్ను తినువాడు వస్తాడయా!'
ఇది కొసరాజు కొసరి కొసరి వ్రాసిన ఐదవ వేదం!

0 0 0

కొసరాజు వ్రాసిన పాటలు రేలంగి, రమణారెడ్డి, పద్మనాభం, సూర్యకాంతం, గీతాంజలిలాటి వారికే పరిమితం కాలేదు. ఆయన హీరో హీరోయిన్లకి కూడా చక్కటి డ్యూయెట్లు, ఎన్నో మధురగీతాలు వ్రాశారు.

'ఓ చందమామ అందాలభామ' (జయం మనదే), ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నది' (తోడికోడళ్ళు), 'జయమ్ము నిశ్చయమ్మురా! భయమ్ము లేదురా' (శభాష్ రాముడు), 'అడిగిందానికి చెప్పి', 'నిలువవే వాలు కనులదానా' (ఇల్లరికం).. ఇలా ఎన్నో వున్నాయి.

'ఉయ్యాల జంపాల' చిత్రంలో 'ఏటిలోని కెరటాలు' అనే పాట బాలమురళీకృష్ణ పాడారు.

కొసరాజు పేరు చెబితే వెంటనే గుర్తొచ్చే ఇంకొక పాట బంగారుపాప చిత్రంలో యస్వీరంగారావుకి పాడిన 'జేబులో బొమ్మా... జేజేలా బొమ్మా..'

కొసరాజు రాఘవయ్యగారి పాటలు ఎప్పుడు విన్నా, ఎలాటి వారినైనా ఆహ్లాదపరచి మనసుకి విశ్రాంతినిస్తాయి.

అందుకే ఆయన పాటలంటే నాకు మహా ఇష్టం!

0 0 0